بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ    نَحْمَدُهٗ وَنُصَلِّى عَلٰى رَسُوْلِهِ الْكَرِيْمِ    وَعَلٰى عَبْدِهِ الْمَسِيْحِ الْمَوْعُوْدِ

## Summary of Friday Sermon Huzur-e-Anwar 28.11.2014 (Telugu)

**మనము బలహీనులమని, మన శత్రువు చాలా శక్తిమంతుడని మనము గుర్తుంచుకోవలెను. శత్రువును ఎదురించుటకు మన వద్ద ఎటువంటి ప్రాపంచిక శక్తి, వసతులు లేదా మరే రకమైన ఆధారము లేదు. కనుక ఇట్టి పరిస్థితులలో దేవుని ముందు మోకరిల్లుట తప్ప మనకు మరో మార్గము లేదు. اياك نعبد واياك نستعين అర్థము చేసుకొంటూ అల్లాహ్ సన్నిధి వారము కావలెను**

### హజ్రత్ అమీరుల్ ముమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 28.11.2014 తేదీన మస్జిద్ బైతుల్ ఫుతూహ్ – లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము

తషహ్హుద్, తఅవ్వుజ్, తస్మియ, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ప్రసంగించిరి.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక చోట ఇట్లనిరి. సహాయము అల్లాహ్‌తోనే కోరవలెనని, అతడే అందుకు అర్హుడని సహాయము గురించి గుర్తుంచుకొనుము. అనగా మీ కార్యములు పూర్తగుటకు ఎవరి సహాయమైనా అవసరమున్నచో మీ సహాయమును నిజమైన రూపంలో తీర్చు ఉనికి కేవలం అల్లాహ్‌యే. సహాయము చేయుటకు శక్తి గలవాడు, సహాయము చేయును. ఇది ఎంత ముఖ్యమైన విషయమనగా ఒక విశ్వాసి వ్యక్తిగత అవసరాలైనా, సంస్థ అవసరాలైనా సదా దీనిని గుర్తుంచుకోవలెను. కాని మనము సామాన్యముగా చూసినచో దీని వైపు వుండవలసినంత శ్రద్ధ ప్రజలకు వుండదు. అల్లాహ్ కరుణించినాడు. కనుక నా అవసరము పూర్తి యినదని మనలో చాలా మంది అందురు. కాని లోతుగా ఆలోచించి, తమ మనసలో నున్న విషయములను గమచనించినచో వివిధ సాధనాల వలన తమ అవసరాలు పూర్తి అయినట్లు వారు భావింతురు.

హజ్రత్ మస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్హు విభిన్న ఉదాహరణలతో ఇటువంటి వివిధ సంఘటనలను వివరించిరి. మానవుడు వివిధ మార్గముల ద్వారా అవసరము అందినట్లు ఊహించును లేదా తన స్వశక్తితో తన ఉద్దేశమును పొందినట్లు భావించును. ఆరంభములో ఇదే స్థితి యుండును. నేను నా అవసరాలన్నిటిని పూర్తి చేసుకోగలనని మానవుడు భావించును. తన శక్తి, విద్య, వివేకముతో అవసరమును పూర్తి చేసుకొనును కూడ. నేను నా సామర్థ్యము, శక్తి, యుక్తులతో నా సమస్యలన్నిటిని పరిష్కరించుకున్నాని మానవుడు భావించును. నేనెవరి సహాయము తీసుకోను, తీసుకోలేదని మానవుడు అహంకారానికి గురై గర్వ పడును. కొన్ని సందర్భాలలో తన అవసరాలను పూర్తి చేసుకోలేని స్థితులు ఎదురగును. అతనికి బయటి నుంచి సహాయము అవసరముండును. అప్పుడతడు తన సన్నిహితుల, బంధువుల వైపు చూడును. వారితో సహాయము తీసుకొనును. వారతనికి సహాయము కూడ చేయుదురు. బంధువులు కూడ మంచి కొరకే వున్నారని అతడు భావించును. నేడు నా బంధువులు లేనిచో నేను నా అవసరాలను పూర్తి చేసుకోలేకుంటిని. కొన్ని పరిస్థితులలో మానవుని కుటుంబీకులు, బంధువులు కూడ అతనికి ఉపయోగపడలేరు లేదా ఉపయోగపడరు. అప్పుడతడు ఆలోచించినచో అతని చూపు మిత్రుల పై పడును. వారతనికి సహాయము చేయగలరు, చేయుదురు కూడ. బంధు, మిత్రులు కూడ

మంచివారే ఎందుకనగా వారతనికి క్లిష్ట పరిస్థితిలో సహాయము చేయుదురు. కాని కొన్ని సందర్భాలలో తమ మిత్రులు కూడ తమ తమ నిస్సహాయతను తెలుపుదురు. వారు సహాయము చేయలేరు. వారి శక్తిని మించినదై యుండును. అప్పుడతడు కొన్ని వ్యవస్థల, సంస్థల వైపు చూడును. వారతనికి సహకరించి అతని పని పూర్తి చేయుదురు. అతని అవసరము పూర్తి అయినప్పుడు వ్యవస్థ, సంస్థలు కూడ ఉపయోగకరమేనని అతడు భావించును. కనుక వ్యవస్థ, సంస్థలతో అతను సంబంధము మరింత పటిష్టము చేసుకొనును. కొన్ని సందర్భాలలో నేను సంస్థతో సహాయము కోరినాను కాని సహాయము అందలేదని కూడ పలువురు దారితప్పినట్లు నేను చూసినాను.

తమ ఆలోచన మేరకు సహాయము లభించినా, పని అయినా సంస్థతో వారి అనుబంధము గట్టి పడునను విషయము సరైనదే. తర్వాత కొందరి జీవితములలో కుటుంబ సభ్యులు, బంధు, మిత్రులు, పలు ఆంక్షల వలన వ్యవస్థతో ముడిపడి యున్న వ్యక్తులు కూడ సహాయము చేయలేని, ప్రయోజనము కలిగించలేని పరిస్థితులు కొందరి జీవితములో ఎదురగును. అతనితో సంబంధమున్న ప్రభుత్వము వద్దకు అతను చేరును. ప్రభుత్వము అతనికి సహాయము చేయును. ఇటువంటి వ్యక్తికి ప్రభుత్వమే సర్వమగును. ఇతర వస్తువులన్ని నిరపయోగమగును. కాని ఒకప్పుడు తన ప్రయత్నములు సఫలము కావు, ప్రణాళికలు ఉపయోగపడవు, బంధువులు పనికిరారు, మిత్రులు లబ్ది చేకూర్చరు, జాతి, వ్యవస్థ కూడ ఉపయోగపడదు, ప్రభుత్వము, మానవ సేవ సంస్థలు కూడ సఫలమునకు ఉపయోగపడవు, అతని పనిని పూర్తి చేయలేవు. వీటిలో ఏ ఒక్క బంధము అవసరము పూర్తి చేయనప్పుడు ఏదో ఒక అదృశ్య శక్తి సహాయపడినట్లు మానవుడు భావించును. అదృశ్య శక్తి సహాయముపై నమ్మకము పెరిగిన కొద్ది అతను సఫలమును అల్లాహ్‌తో జోడించును. అతనికి అల్లాహ్‌పై నమ్మకమున్నచో అల్లాహ్ నా అవసరమును తీర్చినాడని నమ్మును. అల్లాహ్‌తో గట్టి బంధము లేని వారు ప్రాపంచిక సాధనాలనే సర్వముగా భావింతురు. వాటివైపే వారి శ్రద్ధ వుండును. అల్లాహ్ వైపు దృష్టి కలుగదు. కాని ఇవన్ని పనికిరానప్పుడు అల్లాహ్ గుర్తుకు వచ్చును. ఇటువంటి నిరాశ, నిస్పృహ స్థితిలో నాస్తికుడు, అన్యారాధకుడు కూడ అనుకోకుండానే అల్లాహ్ వైపు దృష్టి మరల్చును. అల్లాహ్ పవిత్ర ఖురాన్‌లో ఇట్లు నుడివెను.

وَإِذَا مَسَّكُمُ الضُّرُّ فِي الْبَحْرِ ضَلَّ مَنْ تَدْعُونَ إِلَّآ إِيَّاهُ ۚ فَلَمَّا نَجّٰكُمْ إِلَى الْبَرِّ أَعْرَضْتُمْ ۚ وَكَانَ الْإِنْسَانُ كَفُورًا

అనగా సముద్రములో మీకేదేని ఆపద సంభవించినప్పుడు, అతనికి తప్ప మీరు పిలుచు ప్రతిది తోడువీడును. మిమ్ములను రక్షించి భూభాగము వైపు గొనిపోవునప్పుడు మీరు విముఖులగుదురు. మానవుడు గొప్ప కృతఘ్నుడే. కనుక తూఫానులు, కష్టములలో మీరు అల్లాహ్‌ను గుర్తు చేసుకొందురని అల్లాహ్ పవిత్ర ఖుర్ఆన్‌లో నుడివెను. కాని విముక్తి లభించగానే మరచిపోవుదురు. కష్ట కాలములో అతి వినయముతో అల్లాహ్‌ను గుర్తు చేసుకొందురు, ఇతర సహాయకులందరిని మరచి పోవుట మానవుని స్వభావము. ఈ కష్టము, కష్ట కాలముతో విముక్తి లభించినచో సదా అల్లాహ్‌ను గుర్తుంచుకొందురని అప్పుడు వారందురు. కాని అపాయము తొలగిపోగానే ప్రాపంచికము, గర్వము, అహం మరల వారికి కలుగును. కనుక మానవుడు ఎంతో కృతఘ్నుడే.

ఇటువంటి ప్రజలు అనగా అల్లాహ్‌ను నమ్మని వారి నోట కూడ కష్టకాలములో అల్లాహ్ అని వెలువడును. వారి గురించి హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు ఒక సంఘటన ఇట్లు తెలిపిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కాలములో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం భూకంపముల గురించి భవిష్యవాణి చేసినప్పుడు పెద్ద భూకంపము వచ్చెను. అప్పుడు లాహోర్ వైద్య కళాశాలలో ఒక విద్యార్థి ప్రతి రోజు అల్లాహ్

ఉనికి గురించి చర్చించేవాడు. ఒక్కో సారి అవహేళనకు పాల్పడేవాడు. భూకంపము వచ్చినప్పుడు అతను నివాసముంటున్న గది కప్పు కూలునని భావించెను. ఇప్పుడు ఏ శక్తి కప్పును కూలకుండా ఆపలేదని అతనికి నమ్మకము కలిగెను. అతను హిందు కుటుంబీకుడైనందున అతని నోటి నుండి రామ్, రామ్ అని వెలువడెను. మరుసటి రోజు అతని మిత్రులు ఇట్లడిగిరి. నీవు దేవున్ని నమ్మనే నమ్మవు, అప్పుడు నీకేమైనది, నీవు రామ్, రామ్ అని ఎందుకు అరిచితివి. హిందువులు దేవున్ని రామ్ అని పిలుతురు. అప్పుడు నాకేమైనదో నా తెలివితేటలు పనిచేయలేదని అతడనెను. ఇతర మార్గముల ద్వారా మానవుని పని జరుగుచున్న కొద్ది అతడు వాటి వైపు దృష్టి మరల్చును. అన్ని వైపులా నిరాశ కలగినప్పుడు, ఎటువంటి బాహ్య మార్గము పనికిరానప్పుడు అతడు అల్లాహ్ వైపు దృష్టి సారించును. అప్పుడు అల్లాహ్‌ను ప్రశంసించును, అతని ముందు నిస్సహాయతను వ్యక్తపరచును.

మొదటి ప్రపంచ యుద్ధము గురించి ఇటువంటిదే మరో సంఘటన హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు తెలిపిరి. ఈ సంఘటనను నేను అనేక సార్లు తెలిపినానని వారు స్వయాన అనిరి. ఇట్టి సమయములలో నాస్తికులు కూడ అల్లాహ్‌ను విశ్వసింతురు. ఆ సంఘటన ఇట్లు గలదు. మొదటి ప్రపంచ యుద్ధములో జర్మనీ తన శక్తిని మొత్తం కూడగట్టుకొని సంయుక్త సైన్యములపై దాడి చేసెను. అప్పుడు ఆంగ్లేయుల లేదా సంయుక్త దళాలపై తమ రక్షణకు ఎటువంటి మార్గము లేని సమయము వచ్చెను. 7 మైళ్ళ రక్షణ మార్గము ఖాళి అయ్యెను. సైన్యములోని కొంత భాగము ఒక వైపు మరో భాగము మరో వైపు విడిపోయెను. జర్మనీ సైన్యము అక్కడి నుండి ప్రవేశించి సులభముగా వెనుక నుండి దాడి చేసి, ఆంగ్లేయుల సైన్యమును నాశనము చేయునంత ఖాళి మార్గము ఏర్పడెను. అప్పుడు ఆ సమరంలో నున్న జర్నల్ కమాండర్ ఇన్ చీఫ్ నా వద్ద ఇంత సైన్యము లేదు, ఇటువంటి స్థితి ఏర్పడినదని నివేదిక పంపెను. ఈ విడిపోయిన వరుసను నేను పూడ్చలేను. నేడు మా సైన్యము నాశనమగును, ఇంగ్లాండ్, ఫ్రాన్స్ పేరు అంతమగునని వారు భావించిరి. ఇప్పుడు వినాశనమే మిగిలినదని అక్కడికి టెలిగ్రామ్ వచ్చెను. కమాండర్ పంపిన ఈ టెలిగ్రామ్ వచ్చినప్పుడు ప్రధాన మంత్రి మంత్రులతో సమావేశములో నుండెను. ఏదో ముఖ్యమైన అభిప్రాయ సేకరణ జరుగుచుండెను. ఆ సందేశము అందినప్పుడు ప్రధాన మంత్రి ఏమి చేయగలడు ? అదనపు సైన్యము లేకుండెను, వున్నను ఇంత తొందర అక్కడికి పంపుట కూడ అసాధ్యమే. అప్పుడు వారి అతి పెద్ద నాయకుడు కూడ ఇప్పుడు ఎటువంటి బాహ్య సహాయము అందే పరిస్థితి లేదని భావించెను. అప్పుడు అతడు తోటి వారిని చూచి మన సహాయమునకు అల్లాహ్‌ను ప్రార్థించుదామని అనెను. అందరు మోకరిల్లి ప్రార్థన మొదలు పెట్టిరి. ఈ ప్రార్థన వల్లనే వారు ఆ వినాశనము నుండి ముక్తి పొందిరనుటలో ఆశ్చర్యమేమిటని హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు అనిరి. నేను చదివిన ఈ సూక్తిలో అల్లాహ్ ఇట్లనును. కష్ట కాలములో ప్రతి ఒక్కరు మిమ్ములను వీడినను, అల్లాహ్ ఉనికి ఒక్కటే మీకు తోడుండును, మీకు సహాయమందించును. దుఃఖముతో చేసిన ప్రార్థనలు నాస్తికుడు చేసినా ఆమోదించబడునని అల్లాహ్ తెలిపెను. తన ఉనికిని నిరూపించుటకు నాస్తికులకు అల్లాహ్ ఇటువంటి సంకేతములు చూపును. అతని అదృష్టము మంచిగున్నచో ఇదే సంకేతము అతని మార్గదర్శనమునకు కారణమగును.

ఉద్దేశమేమనగా ప్రాపంచిక ప్రజలు కూడ ఏదో ఒక ప్రణాళిక రచించినను ఎటువంటి ఆసరా కనిపించనప్పుడు అల్లాహ్ ఆసరాను పట్టుకొనుటకు ప్రయత్నింతురు. ప్రాపంచిక వ్యక్తులు కూడ ఇటువంటి దృశ్యములను చూపినప్పుడు మన దృష్టి ప్రతి సమయములో అల్లాహ్ వైపు వుండునని ప్రకటించు వారికి ఇటు

వైపు ఎంత శ్రద్ధ వుండవలెను. దేవుని వైపు నుండి దృష్టి దూరము కాకూడదని, మనము ప్రాపంచిక ఆసరాలను నమ్మకూడదని ప్రతి నమాజ్‌లో, ప్రతి రకాతులో చదువవలెనను ఆజ్ఞతో ఈ దుఆ మనకు నేర్పించబడెను. మొదట ప్రాపంచిక మార్గముల వైపు దృష్టి మరల్చి తర్వాత అల్లాహ్ వైపు మరల్చు వారము కాకూడదు. బాహ్యముగా ప్రయత్నము చేయవచ్చునని అల్లాహ్ తెలిపెను. కాని నమ్మకము అల్లాహ్ ఉనికిపై వుండవలెను. ప్రతి నమాజ్, ప్రతి రకాతులో ఈ దుఆ اياك نعبد واياك نستعين నేర్పి నా వైపు మాత్రమే మీ దృష్టి వుండవలెనని అల్లాహ్ మనకు సూచించెను. ఒక సుదీర్ఘ హదీసు గలదు. ఇందులో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. దాసుడు اياك نعبد واياك نستعين అన్నప్పుడు అల్లాహ్ ఇట్లనును. ఈ సూక్తి నాకు నా దాసుని మధ్య వారధిగా గలదు. నా దాసుడు నాతో అడిగినది నేనిత్తును. దుఆల ఆమోదమునకు అల్లాహ్ నమ్మకము కలిగించుట ముస్లిముల అదృష్టము కాదా ? స్వచ్ఛమైన రీతిలో, సదుద్దేశముతో ప్రార్థనలు చేసినప్పుడు ఈ నమ్మకము శాశ్వతముగా అందును. కేవలము కష్టకాలములో ఇరుక్కున్నప్పుడే దుఆ చేయకూడదు. ఇటుల నాస్తికులు కూడ దుఆ చేయుదురు. అవసరమున్నడు, కష్టము వచ్చినప్పుడు మాత్రమే దుఆ చేయకూడదు. మనము అహ్మదీయులమని, ఈ కాలపు ఇమామ్ హస్తముపై మనము బైఅత్ చేసినామని మనము గుర్తుంచుకోవలెను. మనము మన మాటలు, చేతలు దైవాదేశానుసారము చేసుకొనుటకు ప్రతిజ్ఞ చేసినాము. సుఃఖ, దుఃఖము, ఇబ్బంది, సౌఖ్యములో అల్లాహ్‌తో సహాయము కోరు, దైవేతరులతో దూరముండు ప్రతిజ్ఞ చేసినాము. మనము మన ప్రతిజ్ఞనను పూర్తి చేయుటకు اياك نعبد واياك نستعين అంశమును ఎంత వరకు అర్థము చేసుకోవలెను. మునుగుచున్న నాస్తికుని వలె మనము అల్లాహ్‌ను గుర్తు చేయకూడదు. గొప్ప స్థాయి పొందిన విశ్వాసుల వలె అల్లాహ్ ఆరాధన, సహాయమును గ్రహించి దానిని అనుసరించవలెను. మన పూర్తి శక్తి, మన సర్వ సామర్థ్యము, మన మొత్తం ఆసరా అల్లాహ్ ముందు మోకరిల్లుటయేనని మన ప్రకటన.

ఇందుకు మనము ఏమి చేయవలెనో, ఏమి చేయుచున్నామో మనము గమనించవలెను. మన ప్రార్థనలు, మన అల్లాహ్‌ను పిలుచు ప్రమాణము అల్లాహ్ సూచించిన ప్రమాణము ప్రకారమున్నదా ? లేదా ప్రతి రోజు 32 సార్లు చిలుక వలె పలుకుచున్నామా ? ఇటుల పని ముగుస్తుంది. మనము చాలా బలహీనులము, మన శత్రువు చాలా శక్తిమంతుడని మనము గుర్తుంచుకోవలెను. శత్రువును ఎదురించుటకు మన వద్ద ఎటువంటి ప్రాపంచిక శక్తి లేదు, వసతులు లేవు, ఏ రకమైన ఆసరా లేదు. కనుక ఇట్టి పరిస్థితులలో అల్లాహ్ ముందు మోకరిల్లుట కంటే మనకు మరే మార్గము లేదు. اياك نعبد واياك نستعين భావమును అర్థము చేసుకుంటూ అల్లాహ్ ఆస్థానములో పడి వుండవలెను. నేడు ప్రపంచములో దుష్టశక్తుల దాడి అంతిమ స్థాయికి చేరినది. మన మార్గములో ప్రతి చోట అడ్డంకులు సృష్టించుచున్నారు. మనము ఈ కాలపు ఇమామ్‌ను ఎందుకు విశ్వసించినామని ముస్లిములు కూడ శత్రుత్వములో రెచ్చిపోవుచున్నారు. సంస్థ ప్రపంచపు శ్రద్ధను ఆకట్టుకుంటున్నదని ఇతరులు కూడ మనతో అసూయ పడుచున్నారు. అల్లాహ్ ఎవరి సహాయమునకు నిలుచునో అతడు విజయవంతమగునని సదా గుర్తుంచుకొనుము. అల్లాహ్ శక్తులు చాలా విశాలమైనందున, అతని శక్తులు అనంతమైనందున ఏ ప్రాపంచిక శక్తి అతని విజయమును అడ్డుకోలేదు. అల్లాహ్ ఉనికి పరిమితంగా లేదు, అతని లక్షణములు కూడ పరిమితంగా లేవు. కనుక అతని ముందు మోకరిల్లుట ప్రతి అహ్మదీయుని బాధ్యత, అతనితో సహాయమాచించుట ప్రతి అహ్మదీయుని కర్తవ్యము.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఒక చోట ఇట్లనిరి. "అల్లాహ్ ఎంతో స్వయంభువు. అధికముగా పదే పదే దుఆ చేయనంత వరకు అతడు లెక్క చేయడు. కనుక అధికముగా పదే పదే దుఆ చేయుట మన విజయ రహస్యము. ఇటువైపు మనము చాలా శ్రద్ధ వహించవలసిన అవసరము గలదు. ఏ కష్టములు మనకు ఎదురైనా, అవి ఏ వర్గము నుండి తలెత్తినా లేదా ప్రభుత్వము వైపు నుండి ఏర్పడినా, అసూయ పడు వారి నుంచి సమాజములో పీడనము ఏర్పడినా, ఇందుకు మీడియాను ఉపయోగించినా లేదా ఇతర ఏ సాధనాలను ఉపయోగించినా ! లేదా ఈ కార్యములో నిమగ్నమైయున్న ప్రజలు సంస్థ గౌరవమును దిగచార్చుటకు కృషి చేసినను అల్లాహ్ సహాయమును పొందుటకు మనము దుఆలు చేయవలెను. మనము మరెవరితో సహాయమును ఆశించలేము, ఆశించము. మన తప్పిదములు అల్లాహ్ సహాయమును వెనక్కి నెట్టినచో మాపై దయతలచి మమ్ములను క్షమించుము. తన అసంతృప్తి స్థితి నుండి మమ్ములను తీసివేసి నీ శుభములు, బహుమానముల వర్షము అనుక్షణం పొందుచున్న, اياك نعبد واياك نستعين నిజమైన భావము పొందిన వారిలో మమ్ము చేర్చుము.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనిరి. చూడుము అల్లాహ్ మనకు اياك نعبد ను బోధించెను. మానవుడు తన శక్తిని నమ్ముకొని అల్లాహ్ నుండి దూరమయ్యే అవకాశముండెను. కనుక اياك نستعين కూడ నేర్పి, నేను చేయుచున్న ప్రార్థన నా శక్తి, యుక్తులతో చేయుచున్నానని భావించకుమని నేర్పెను. అల్లాహ్ స్వయాన సహాయము చేయనిదే, అతడు కరుణించనిదే మానవుడు స్వయముగా ఏమి పొంద లేడు. కనుక ఈ వాస్తవమును కూడ మనము సదా గుర్తుంచుకోవలెను. ఈ ముఖ్యమైన అంశమును ఎల్లప్పుడు మన ముందుంచుకొని, అర్థము చేసుకొని, దానిని ఆచరించు అనుగ్రహము మనకు లభించుగాక! ఆమీన్.

మరల నేను దుఆ కొరకు గుర్తు చేయుచున్నాను. ప్రపంచ పరిస్థితులు ఎంతో వేగముగా మారుచున్నాయి, అల్లాహ్ వాటిని సంస్థ ప్రగతికి అడ్డంకిగా కాక ప్రగతికి ఉపయోగపడేటట్లు చేయుగాక! తద్వారా మనము అల్లాహ్ ప్రార్థన చేయువారము, అతని సహాయము, సహకారముతో లబ్ది పొందు వారమగుగాక!

☼☼☼

*Summary: Majlis Ansarullah Bharat, Translation:Hafiz Syed Rasool Niyaz, (Telugu Desk)*

Published by: Nazarath Nashr-O-Isha'ath, e-mail:telugudesk@yahoo.in
P.O.:Qadian, Dist:Gurdaspur, Pin:143516, Punjab, Mob 84376 99866

BOOK POST (PRINTED MATTER)

*To,*

........................................................................................

........................................................................................